సాక్షి
వికారాబాద్

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



కేంద్ర పథకాలపై..

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ పేర్కొన్నారు. IIలో▸



మద్యం మత్తులో..

అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ యువతి అక్కడికక్కడే మృతిచెందాడు. IIలో▸



వన మహోత్సవంపై దృష్టి

వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు మండల అధికారులు సిద్ధమవుతున్నారు. IIIలో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం



సురేశ్ కుమార్

తాండూరు టౌన్: తాండూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సురేశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సెల్ నంబర్ 99592 26251కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని ప్రయాణికులను కోరారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలకు రంగం సిద్ధం ?

వికారాబాద్: కొత్తగడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలకు రంగం సిద్ధమైంది. పాఠశాలలో విద్యార్థినులపై వరుస వేధింపుల నేపథ్యంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక బృందం ఇటీవల ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో కమిషన్ చైర్మన్.. కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు సమాచారం. కొత్తగడి గురుకుల ఘటనపై నివేదిక ఇవ్వడంతోపాటు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో చర్యలకు సిఫారసు చేస్తూ కలెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్లు సమాచారం.

అసలేం జరిగిందంటే..

నెల రోజుల క్రితం వికారాబాద్ సమీపంలోని కొత్తగడి గురుకులంలో సిబ్బంది వేధిస్తున్నారంటూ ఓ బాలిక భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మరువకముందే ప్రిన్సిపాల్ కొంతమంది విద్యార్థినులను తన చాంబర్‌కు పిలిపించుకొని బూతులు తిట్టే వీడియో బయటికి వచ్చింది. దీనిపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ సభ్యులు గత సోమవారం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కలిసి ఫిర్యాదు చేశారు. బీసీ కమిషన్ ఆదేశాలతో కమిటీ వేసిన అధికారులు విచారణ చేపట్టి నివేదిక సమర్పించారు. అనంతరం విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఎలాంటి చర్యలు లేకుండా చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు దిగిన వీడియో వైరల్ కావటంతో ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

నేడు తాండూరులో ఎంపీ కొండా పర్యటన

తాండూరు రూరల్: మండలంలో శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోనూర్, వీర్‌శెట్టిపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఎంపీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం పెద్దేముల్ మండంలోని మంబాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై ఎంపీ పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి



ఉద్యోగం సాధించిన యువతికి నియామక పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

తాండూరు టౌన్: మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని బీసీ సంఘం, గ్లోబల్ యువతరం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 86 మంది ఉద్యోగాలు సాధించారు. స్థానిక సింధు బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు 300 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 10 ఎన్ఎంసీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్య ఏ వర్గానికి సొంతం కాదని, అణగారిన వర్గాల పిల్లలు సైతం విద్యను ఆర్జించవచ్చని, ప్రజల్లో చైతన్యం రగిలించిన పోరాటం మరువలేమన్నారు. గ్లోబల్ యువతరం ఫౌండేషన్ సభ్యులు జాబ్‌మేళా నిర్వహణలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్లోబల్ యువతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయేందర్, కార్యదర్శి అరుణ్ రాజ్, సింధు కళాశాల వ్యవస్థాపకులు రంగారావు, బీసీ సంఘం నాయకులు సయ్యద్ షకూర్, అనిత, మంజుల, లక్ష్మీనర్సమ్మ, విజయలక్ష్మి, శ్రీనివాస్, బస్వరాజ్, శ్రావణ్, రామకృష్ణ, లక్ష్మణాచారి, రమేష్, బసంత్, జగదీశ్వర్, సిద్దార్థ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం 6.77 కోట్లు

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో వ్యాపారం



మార్కెట్‌కు వచ్చిన కంది ఉత్పత్తులు



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

- ఫీజు రూపంలో భారీగా సమకూరిన నిధులు
- గతేడాది కంటే అధికంగా వచ్చిన కంది ఉత్పత్తులు

తాండూరు టౌన్: తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో వ్యాపారం జరిగింది. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ.6.77 కోట్ల ఆదాయం సమకూరింది. మార్కెటింగ్ శాఖ ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించడంలో అధికారులు సక్సెస్ అయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్దగా తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు పేరుంది. నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాల రైతులు పండించిన కంది, పత్తి, శనగ, పెసర, మినుము, వేరుశనగ, వరి ధాన్యం, మక్కలు, సోయాబీన్, కుసుమ పంట ఉత్పత్తులను ఇక్కడికి తెచ్చి క్రయ విక్రయాలు నిర్వహిస్తుంటారు. మార్కెటింగ్ శాఖ ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసిన అధికారులు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల ప్రశంసలు పొందారు.

పోటెత్తిన కంది ఉత్పత్తులు

తాండూరు నియోజకవర్గంలో కంది పంట బాగా పండింది. దీంతో ఉత్పత్తులు మార్కెట్‌కు పోటెత్తాయి. గత సీజన్(2023–24)లో 74,858 క్వింటాళ్ల దిగుబడి రాగా రూ.65.75 కోట్లు వ్యాపారం జరిగింది. మార్కెట్‌కు ఒక్క శాతం ఫీజు రూపంలో 65.75 లక్షల ఆదాయం సమకూరింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌కు 1,36,718 క్వింటాళ్ల కంది ఉత్పత్తులు వచ్చాయి. రూ.98.43 కోట్ల వ్యాపారం జరగ్గా మార్కెట్‌కు రూ.98.43 లక్షల ఆదాయం సమకూరిందని మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ హబీబ్ అల్వీలు తెలిపారు. ఇది కేవలం కంది పంట క్రయవిక్రయాల ద్వారా వచ్చిన ఆదాయని వారు తెలిపారు.

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో 2024 - 25లో జరిగిన వ్యాపారం

పంట రకం	క్వింటాళ్లు	వ్యాపారం (రూ.లలో)	మార్కెట్ ఫీజు (రూ.లలో)
కందులు	1,36,718	98,43,69,600	98,43,696
శనగలు	1,126	61,36,700	61,367
పెసలు	18,290	12,88,89,630	12,88,896
మినుములు	10,840	7,99,66,680	7,99,666
వేరుశనగ	4,612	2,81,83,932	2,81,839
వరి ధాన్యం	15,320	3,18,96,240	3,18,962
మక్కలు	2,984	73,37,656	73,376
సోయా	6,549	2,68,77,096	2,68,770
ప్రభుత్వ ఏజెన్సీలు			2,18,63,000
సీసీఐ (పత్తి)			1,36,00,000
ఇతర మార్కెట్ ఫీజులు			1,92,00,428

“ త్వరలో పండ్ల మార్కెట్



తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు అన్ని రకాల పంట ఉత్పత్తులు వచ్చేలా చర్యలు చేపట్టాం. త్వరలో ఇక్కడ కూరగాయలు, పండ్ల మార్కెట్లు ఏర్పాటు చేస్తాం. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌కు రూ.3.19 కోట్ల ఆదాయం రాగా.. 2024 – 25లో రెట్టింపు ఆదాయం రూ.6.77 కోట్లు వచ్చింది. – పి.బాల్‌రెడ్డి, చైర్మన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, తాండూరు

ఆదర్శప్రాయుడు పూలే

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఘనంగా జయంతి వేడుకలు

అనంతగిరి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి జ్యోతీరావ్ పూలే అని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతీరావ్ పూలే గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీబీసీడీఓ కే.ఉపేందర్, డీఎస్సీ డబ్ల్యూఓ మల్లేశం, సీపీఓ వెంకటేశ్వర్లు, డీసీఎస్ఓ మోహన్‌బాబు, డీఎంహెచ్ఓ వెంకటరవణ, ఏబీసీడీఓ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్షంను విజయవంతం చేయాలి

పోషణ అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు నిర్వహించే పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా స్త్రీ శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వైద్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కౌమార బాలికల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీపీవో జయసుధ, డీఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్ఓ వెంకటరవణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ సహజమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మనం చేసే సేవలే గుర్తుండిపోతాయన్నారు. అనంతరం అశోక్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇతర అధికారులు

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



కొంషెట్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మండలంలో సుడిగాలి పర్యటన
- వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

మర్పల్లి: గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డితో కలిసి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. రూ.22 కోట్ల పైచిలుకు నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొంషెట్‌పల్లిలో అంబేడ్కర్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శిలాఫలకం వేశారు. అనంతరం గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా మర్పల్లి మండలంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. 17 జీపీల్లో రూ.5.63 కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తా

మర్పల్లి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. మార్కెట్ రోడ్డు నుంచి ఎస్టీ ఆశ్రమ గురుకుల పాఠశాల వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మార్కెట్ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి శిలాఫలకం వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, ఈఓ పీఆర్‌డీ లక్ష్మీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్, పార్టీ సీనియర్ నాయకులు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు ఖలిమొద్దీన్, శంకరయ్యగౌడ్, నాగేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలి

చేవెళ్ల: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ సంస్కృతీ సంప్రదాయలను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలాలు, గ్రామాల్లో జరిగే శోభాయాత్రలో హిందువులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, శర్వలింగం, కుంచం శ్రీనివాస్, మహేందర్, శ్రీనివాస్, అభి, కృష్ణారెడ్డి, శ్రీశైలం, బజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల నిర్మూలన మన బాధ్యత

కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ శాఖ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. విద్యా సంస్థలు, వసతి గృహాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను చైతన్యం చేయాలని సూచించారు. గంజాయి సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లా కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైలు, రోడ్డు మార్గాల్లో గంజాయి రవాణా చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖలకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ గౌడ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరవణ, డీవైఎస్ఓ హనుమంతరావు, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, ఆర్‌టీఓ వెంకట్‌రెడ్డి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్, డీపీఓ జయసుధ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే మోదీ ఆశయం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మండలంలో సీసీ రోడ్లు ప్రారంభం



ధారూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు: బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్, కొంతమంది మంత్రుల నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి చెందాయని, మిగిలిన ప్రాంతాలను విస్మరించారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం, ఎంపీ నిధులతో మండలంలోని నాగారం, స్టేషన్‌ధారూరు, ధారూరు, రుద్రారం, అల్లీపూర్ గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి రాష్ట్రం, రాష్ట్రాల్లోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే ప్రధాని మోదీ ఆశయమని పేర్కొన్నారు. తనకు కేటాయించిన ఎంపీ నిధుల్లో ఎక్కువ శాతం ఇక్కడే ఖర్చు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఎంపీ దృష్టికి తెచ్చారు. వెంటనే ప్రాజెక్టు కాలువలను పరిశీలించి ఇరిగేషన్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. రబీ పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, సీనియర్ నాయకులు పాండుగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు ఎం.రమేశ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, నాయకులు రుద్రారం వెంకటయ్య, ఉపేందర్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే కాంగ్రెస్ పోరాటం



యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- పరిగిలో జై సంవిధాన్ యాత్ర

పరిగి: రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పార్టీ.. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 2, 3, 11 వార్డుల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇవ్వకున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం కుట్ర పన్ని కావాలనే రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఆపుతోందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు నిధులు అందజేస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం మొండి చేయి చూపించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతతత్వ ప్రభుత్వమని దేశంలోని ప్రజలను విడదీసి పాలిస్తోందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని ఆరోపించారు. దేశంలోని బలహీన వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తుంటే కాంగ్రెస్ ఊరుకోబోదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయడమే యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాలను రద్దు చేయాలి

- ముస్లిం సంఘాల జేఏసీ డిమాండ్
- వికారాబాద్‌లో నిరసన కార్యక్రమం



అలంపల్లి ఈద్గా వద్ద మాట్లాడుతున్న ముస్లింలు

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని వికారాబాద్ ముస్లిం సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని ఆలంపల్లి ఈద్గా ఆవరణలో శాంతియుత నిరసన తెలిపారు. అనంతరం మత పెద్దలు, నేతలు మాట్లాడారు. భారత రాజ్యాంగం ముస్లింలకు కల్పించిన హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం వల్ల ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం, అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి నల్లచట్టాల వల్ల స్వాతంత్ర్యానికి పూర్వం మన పూర్వీకులు ధార్మిక కార్యక్రమాల కోసం దానం చేసిన ఆస్తులు ఈ రోజు మనవి కాకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సవరించిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఎర్రవల్లి జాఫర్, తస్వర్‌అలీ, ఎండీ హఫీజ్, జాకీర్‌మోయినొద్దీన్, మహ్మద్ ఉస్మాన్, రఫీయొద్దీన్, ఫెరోజ్, రవూఫ్, ఎజాజ్, జైనొద్దీన్, అర్షద్ మౌలానా, ఆదాం, ఫయాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల వెల్లువ

రాజీవ్ యువ వికాసానికి 14వరకు అవకాశం



దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు

దౌల్తాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు బీసీ కార్పొరేషన్‌కు 429, ఎస్సీ 158, ఎస్టీ 76, ఈబీసీ 03, మైనార్టీ కార్పొరేషన్‌కు 30 మొత్తం 696 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు తుది గడువు ఉండగా తర్వాత 14 వరకు పొడిగించారు. నేడు రెండో శనివారం, ఆదివారం, 14న అంబేడ్కర్ జయంతి ఉండడంతో మూడు రోజులు సెలవులు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం వరకు దరఖాస్తుల ప్రక్రియ చేయాలని లబ్ధిదారులు బారులు తీరారు. కానీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సోమవారం కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పించండి



అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌సీ గౌడ్ తదితరులు

తాండూరు రూరల్: మల్కాపూర్ గ్రామంలోని నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం మల్కాపూర్ గ్రామ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బందికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కాపూర్ గ్రామ భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఫ్యాక్టరీ తరఫున గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్‌సీ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి, యువకులు ప్రశాంత్‌గౌడ్, అరవింద్, తుకారం, తుల్జప్ప, నర్సింహా, బాలాజీ, రఘుగౌడ్, మహేష్, నిఖిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకాన్ని పెంచాలి



గోప్యానాయక్ తండాలో పోషణమాసాన్ని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కుల్కచర్ల: నిత్యజీవితంలో చిరుధాన్యాల వాడకాన్ని పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం గోప్యానాయక్ తండాలో పోషణ మాసం ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు పోషక ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ, ఏ.మల్లమ్మ, కార్యదర్శి శారద, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.



దోమ: మాట్లాడుతున్న రమేశ్



అనంతగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు పాల్గొన్న సదానందరెడ్డి

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్

దోమ: కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో క్రియాశీలక సభ్యులు, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మంజూరు చేస్తున్న పథకాలను ప్రజలకు అందిస్తూ తామే ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వ నిధులే విడుదలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేకల యాదయ్య. మండల అధ్యక్షుడు మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోరల అనంతయ్య. ఓబీసీ మోర్చా తాలూక కన్వీనర్ విజయ్, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందజేస్తుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందారెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలంలోని ద్యాచారం గ్రామంలో పార్టీ పిలుపు మేరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాల లబ్ధిదారులను కలిశారు. అనంతరం స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని బీజేపీ బూత్ లెవల్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామ నాయకులు ఆనందం, శ్రీశైలం, చంద్రశేఖర్, యాదయ్య, రమేష్, ప్రసాద్, నవీన్, విష్ణు, మంజునాథ్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బంట్వారం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ గీతా సెల్ జిల్లా అధ్యక్షుడు ఈడ్గి వెంకటేషంగౌడ్ పేర్కొన్నారు. గావ్‌చలో-ఘర్‌చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన బంట్వారం మండలంలోని రొంపల్లిలో ఇంటింటికి వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకట రవణ

అనంతగిరి: ఇటీవల వైద్యులుగా, యంఎల్‌హెచ్‌పీలుగా విధులు చేపట్టిన వారంతా సకాలంలో హాజరై పేద ప్రజలకు సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అందిస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో పల్లె దవాఖానాలో వైద్యులను నియమించారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారులు డాక్టర్ జీవరాజ్, రవీంద్ర, పవిత్ర, బుచ్చిబాబు, జానీ, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలను తగ్గించాలి



మన్నెగూడ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పూడూరు: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేఖంగా మన్నెగూడ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు 2024 నుంచి తగ్గాయని, ఇటీవలి కాలంలో అవి మరింత తగ్గాయని కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ పై రూ.50 పెంచడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ప్రసాద్, విజయ్, అనంతయ్య, రాములు, పాండు, వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మధ్య తగాదా

భర్త అదృశ్యం

శంకర్‌పల్లి: దంపతుల మధ్య మనస్పర్ధల కారణంగా మనస్తాపానికి గురైన భర్త అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన పి.రవి(33), తేజశ్రీ దంపతుల మధ్య ఆర్థిక అంశాల్లో తరచూ గొడవపడుతున్నారు. ఈ క్రమంలో 7న మరో మారు గొడవ పడడంతో రవి.. ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయన సోదరుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకదానికొకటి ఢీకొని..

వరుసగా నాలుగు వాహనాలు ధ్వంసం

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై వాహనాల రద్దీ కారణంగా ముందు వెళ్తున్న వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీ కొనడంతో నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఓ ఆటో ఆగి ఉంది. దాని వెనుకే మరో ఆటో వెళ్లి ఆగుతుండగానే గమనించకుండా వెనకాలే వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు ఆగి ఉన్నమరో ఆటోను ఢీకొట్టింది. కారు వెనకాలే వచ్చిన మరో కారు ముందున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ఆటోలు, రెండు కార్లు ధ్వంసమయ్యాయి. వాహన యజమానులు వాగ్వాదానికి దిగడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు వచ్చి వారిని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించి పంపించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రి ఉద్యోగి ఆత్మహత్య

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రి ఉద్యోగి ఒకరు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. యాజమాన్యం సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం బెంగాల్‌కు చెందిన మెహరాజ్ ఆలమ్ (24) ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రిలో గత నాలుగేళ్లుగా నర్సింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురైన మెహరాజ్ ఆలం శుక్రవారం అధిక మొత్తంలో మత్తు ఇంజెక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీన్ని తోటి సిబ్బంది గమనించి వెంటనే చికిత్స అందించేందుకు ప్రయత్నించినా పరిస్థితి విషమించి..మెహరాజ్ అక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడినట్లు సన్నిహితులు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయన్ని వెలుగులోకి రాకుండా ఆసుపత్రి యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. తీరా బయటకు పొక్కడంతో పోలీసులు మేహరాజ్ రూంలో ఉంటున్న వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఎల్‌జీ యాజమాన్యం ప్రతి నెలా కార్మికులు, కిందిస్థాయి ఉద్యోగులకు, డాక్టర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల సుమారు 100 మంది కార్మికులు ఈ విషయంపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వచ్చారు.

వృత్తి నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు

ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణతో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలక్రిష్టారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని సైంట్ విద్యాసంస్థల 24వ వార్షికోత్సవానికి శుక్రవారం సాయంత్రం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని.. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పక్షాన అలుపెరగని పోరాటం

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- తుక్కుగూడలో సంఘం జిల్లా కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్ని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. తుక్కుగూడలో శక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం 2006లో టీడబ్ల్యూజేఎఫ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి ఈరోజు వరకు జర్నలిస్టుల పక్షాన అలుపెరగకుండా పోరాడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని జర్నలిస్టు సంఘాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి వత్తాసు పలికి, స్వార్థ రాజకీయాల కోసం సంఘాలను వాడుకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేటు విద్యారంగంలో జర్నలిస్టుల పిల్లలుకు ఫీజులో 50 శాతం రాయితీ అందించాలని, వైద్యంలో రాయితీ ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా సంఘంలో చేరిన వారికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర నాయకులు జగదీశ్, రాజశేఖర్, ఆనందం దేవేందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సత్యానారాయణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతూ పట్టుబడిన బీటెక్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: గంజాయి తాగుతున్న ఐదుగురు బీటెక్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఇబ్రహీంపట్నంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గురునానక్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు స్థానిక చైతన్యనగర్‌లో నివాసముంటున్నారు. వీరు ఓ ఇంట్లో గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 290 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తితో పాటు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసానికి చదువు దోహదపడాలి



విద్యార్థులతో బోధమయానందస్వామి

ఇబ్రహీంపట్నం: రామకృష్ణ మఠం ప్రతినిధి శ్రీబోధమయానందస్వామి శుక్రవారం పెద్ద అంబర్‌పేట్‌లోని క్యాండర్ షైన్ స్కూల్ విద్యార్థులతో గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే విద్య పుస్తకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా ఉండాలని సూచించారు. ధర్మం, శాంతి, సేవాభావం అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 142 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 55 సంవత్సరాల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వక్ఫ్ బిల్లు రద్దు చేయాలి

యాలాల: బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లు నల్లచట్టం లాంటిదని, వెంటనే దాన్ని రద్దు చేయాలని ముస్లిం నాయకులు డిమాండ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామ మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..వక్ఫ్ బిల్లు విషయంలో బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపై మొసలి కన్నీరు కారుస్తుందన్నారు. వక్ఫ్ బిల్లు రద్దు చేసేంతవరకు తాము నిరసనలు, ర్యాలీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, మైనార్టీ నాయకులు షేక్ జమీర్, అహ్మద్, జిలానీ, బాలేసాబ్, రఫీక్, మౌలాన, మైనొద్దీన్, ముఖ్తార్, ఆసిఫ్, సులేమాన్, మౌలాన, మహమూద్, రహీం బాబా, రజాక్, అక్రం, అమీర్ పాల్గొన్నారు.



మసీదు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ నాయకులు

నాటుసారా పట్టివేత



తయారీ కేంద్రం వద్ద పోలీసులు

దౌల్తాబాద్: నాటుసారా తయారీదారిని పట్టుకున్న సంఘటన మండలంలోని పోచమ్మగడ్డ తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం దౌల్తాబాద్ పోలీస్ బృందం పోచమ్మగడ్డ తండాలో సోదాలు నిర్వహించారు. అక్కడ సబావత్ గుండమ్మ నాటుసారా తయారు చేస్తుందని తెలుసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 2.5లీటర్ల సారాను పట్టుకున్నారు. అనంతరం తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేశారు. గుండమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

గిరిజన రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి



గిరిజన రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి శుక్రవారం నక్కర్తమేడిపల్లి రెవెన్యూ పరిధిలో పర్యటించారు. ఏళ్లుగా కబ్జాలో ఉన్న పల్లెచెల్కతండా గిరిజనులకు ఆ భూములపై పరిహారం అందకపోవడంతో గురువారం సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకోవడం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్డీఓ అనంత్‌రెడ్డి తహసీల్దార్ అయ్యప్పతో కలిసి సర్వేనంబర్ 184లో పర్యటించారు. ఎన్నేళ్లుగా కబ్జాలో ఉంటున్నారు, గతంలో పరిహారం ఎందుకు రాలేదు, దరఖాస్తు చేసుకోలేదా.. అధికారులు రాలేదా అని ఆరా తీశారు. కబ్జాలో నిజంగా ఎంతమంది రైతులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, టీజీఐఐసీ అధికారులతో మాట్లాడి కబ్జాలో నిజమైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తాడిపర్తిలో పనులను అడ్డుకున్న రైతులు

తాడిపర్తిలో శుక్రవారం ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనులను ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. 104 సర్వే నంబర్‌లో కబ్జాలో ఉన్న రైతులకు పరిహారం అందజేసే వరకు ఆందోళన నిర్వహిస్తామని.. సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సముదాయించారు. విషయాన్ని ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం వచ్చి వివరాలు తెలుసుకుంటానని చెప్పడంతో రైతులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

రాచకొండ సీపీ సుధీర్ బాబు



నాగారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

కీసర: నేర నియంత్రణతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. కమిషనరేట్‌లోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 1460 సీసీ కెమెరాలను నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మల్కాజిగిరి జోన్ పరిధిలో మొత్తం 1460 కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందులో 410 కెమెరాలను 17 కాలనీల్లో, ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేశామన్నారు. వీటి కోసం రూ.1.19 కోట్లు ఖర్చు చేశామని, రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. మిగిలిన 1050 కెమెరాలను 212 దేవాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు 5260 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, 93,061 నేను సైతం కెమెరాలు కలిసి మొత్తం 98,321 కెమెరాలను జియో ట్యాగింగ్ చేశామన్నారు. వీటన్నిటినీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందం నిరంతరం పరిశీలిస్తుందన్నారు. భద్రత, సురక్షితమే ధ్యేయంగా నిఘా నేత్రాలను ఆవిష్కరిస్తున్నామన్నారు. కోర్టులకు సాక్ష్యాధారాలను సమర్పించవలసి వచ్చినప్పుడు కెమెరాలు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్‌గా మల్కాజిగిరి రాచకొండ కమిషనరేట్ ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజ, అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ గౌడ్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారుతో ఢీ

- బైక్‌పై వెళ్తున్న యువతి మృతి, యువకుడికి తీవ్ర గాయాలు
- అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో ఘటన
- కారుతో పరారవుతుండగా నిందితుడిని పట్టుకున్న పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్



ప్రమాదానికి కారణమైన కారు

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ యువతి అక్కడికక్కడే మృతిచెందగా.. యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారుతో పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా నారాయణపూర్ మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శంకరయ్య కూతురు స్పందన (19) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ సంస్కృతి ఇంజనీరింగ్ కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముండే తన స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి గురువారం సాయంత్రం బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఘట్‌కేసర్ వైపునకు వెళ్తున్నారు. ఈ సమయంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ గాల్లో ఎగిరి కారు అద్దంపై పడ్డారు. కారు అదే స్పీడ్‌లో వెళ్లడంతో కింద పడిపోయారు. స్పందన అక్కడికక్కడే మృతిచెందగా, సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సాయికుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. స్పందన మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో అదుపులోకి..

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన స్కోడా కారుతో సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తుండగా కారు అద్దాలు పగిలి ఉండడం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా యాక్సిడెంట్ చేసినట్లు అంగీకరించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి ప్రాంతానికి చెందిన ప్రదీప్ అనే వ్యాపారవేత్తగా గుర్తించారు. ప్రస్తుతం అతను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల అదుపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి రియల్టీ
శనివారం
12-04-2025



ఇల్లు ఆఫీసు షాపింగ్

- మెట్రో నగరాల్లో మిశ్రమ వినియోగ భవనాలు
- ఆయా నిర్మాణాల్లో రిటైల్ స్పేస్‌కు డిమాండ్
- 2025 క్యూ1లో దేశంలో 24 లక్షల చ.అ. లావాదేవీలు
- అత్యధికంగా హైదరాబాద్‌లోనే 34 శాతం లీజులు
- గ్రేటర్‌లో 8 లక్షల చ.అ. రిటైల్ స్థల లావాదేవీలు
- మన తర్వాతే ముంబై, ఎన్‌సీఆర్ నగరాలు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో నగరాలలో సంప్రదాయ షాపింగ్ మాల్స్‌కు కాలం చెల్లింది. ఇల్లు, ఆఫీసు, మాల్ అన్నీ ఒకే చోట ఉండే మిశ్రమ వినియోగ భవనాలు ఊపందుకుంటున్నాయి. నగరవాసులు నివాసం ఉండే చోటుకు సమీపంలోనే కార్యాలయం, వారాంతాల్లో కుటుంబంతో కలిసి ఆనందంగా గడిపేందుకు షాపింగ్ మాల్ కూడా దగ్గర్లోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లు, ఆఫీసు స్పేస్‌తో పాటు రిటైల్ స్పేస్ అందుబాటులో ఉండే మిశ్రమ భవనాలకు డిమాండ్ పెరిగింది.

- ఈ ఏడాది జనవరి–మార్చి (క్యూ1)లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 24 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లావాదేవీలు జరిగాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడించింది. ఏడాది కాలంలో 55 శాతం వృద్ధి రేటు నమోదైంది. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో మాల్స్, రిటైల్ సరఫరా పెరగడమే లావాదేవీల వృద్ధికి ప్రధాన కారణం. ఈ ఏడాది వచ్చే మూడు త్రైమాసికాల్లో కొత్తగా 70 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తుందని అంచనా వేసింది.

అత్యధికంగా గ్రేటర్‌లోనే..

గృహాలు, కార్యాలయాల విభాగంలోనే కాదు రిటైల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ దూసుకెళుతోంది. 2025 క్యూ1లో జరిగిన లావాదేవీల్లో అత్యధికంగా 34 శాతం వాటా మన గ్రేటర్‌దే. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నగరంలో 8 లక్షల రిటైల్ స్థల లావాదేవీలు జరిగాయి. ఏడాది కాలంతో పోలిస్తే ఇది 106 శాతం ఎక్కువ. హైదరాబాద్ తర్వాత అత్యధికం రిటైల్ స్పేస్ లావాదేవీలు ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాల్లో జరిగాయి. 2025 క్యూ1లో దేశంలో జరిగిన మొత్తం రిటైల్ స్థల లీజుల్లో ముంబై 24 శాతం, ఢిల్లీ–ఎన్‌సీఆర్ 17 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. ఆర్థిక రాజధాని(ముంబై)లో 5.8 లక్షల చ.అ., దేశ రాజధానిలో 4.1 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి.

హైస్ట్రీట్‌కు డిమాండ్

గ్రేటర్‌లో హైస్ట్రీట్ ప్రాంతాల్లోని రిటైల్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. నగరంలో జరిగిన లీజు లావాదేవీల్లో హైస్ట్రీట్ వాటా 90 శాతంగా ఉంది. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి వంటి ప్రాంతాల్లో అత్యధిక లావాదేవీలు జరిగాయి. ఒక్క జూబ్లీహిల్స్‌లోనే ఏకంగా 24 శాతం లావాదేవీల వాటా కలిగి ఉంది. జూబ్లీహిల్స్‌లో రిటైల్ స్పేస్ అద్దెలు ఏటా 13.6 శాతం పెరుగుతున్నాయి. షాపింగ్ మాల్స్‌లో మాత్రం అద్దెలు స్థిరంగా ఉన్నాయి. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, టోలిచౌకీ ప్రాంతాలలో కొత్త ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణలతో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి. సూక్ష్మ మార్కెట్లతో కనెక్టివిటీ పెరగడంతో ఆయా ప్రాంతాలలో రిటైల్ స్టోర్లు, స్థలాలకు ఆదరణ పెరిగింది.

దేశీయ బ్రాండ్లదే హవా..

ఫ్యాషన్, వెల్‌నెస్, ఫుడ్ అండ్ బేవరేజెస్ విభాగాలు ఎక్కువగా రిటైల్ స్పేస్‌ను లీజుకు తీసుకుంటున్నాయి. లీజు లావాదేవీల్లో దేశీయ బ్రాండ్ల వాటా ఏకంగా 98 శాతంగా ఉంది. ఫ్యాషన్ విభాగం 27 శాతం, వెల్‌నెస్ 19 శాతం, ఫుడ్ అండ్ బేవరేజెస్ 16 శాతం లీజు వాటాలను కలిగి ఉన్నాయి.



ఐఓటీ గృహాలు!

డిజిటల్ తాళాలు, స్మార్ట్ కెమెరాలు, వీడియో డోర్ బెల్స్

నగరంలో పెరుగుతున్న ఐఓటీ ఆధారిత పరికరాల వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాత ఇంటి స్వరూపం మారిపోయింది. ఇంటిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారిత భద్రతా ఉపకరణాల వినియోగం పెరిగింది. రియల్ టైమ్‌లో ట్రాక్ చేసే స్మార్ట్ కెమెరాలు, డిజిటల్ లాక్స్, స్మార్ట్ వీడియో డోర్ బెల్స్, లైట్లు, కర్టెన్లు ప్రతిదీ స్మార్ట్‌గా మారిపోయాయి. వేలిముద్ర, ఐరిష్ చూపిస్తే చాలు ఆటోమెటిక్‌గా ఇంటి తలుపులు తెరుచుకుంటాయి. ఇంట్లో మనం లేకపోయినా ఎవరైనా అతిథులొస్తే ఫోన్‌లో నుంచే గుమ్మం తెరిచి స్వాగతం పలకొచ్చు. గదిలోకి రాగానే లైట్లు వాటంతటవే ఆన్, ఆఫ్ అవుతుండటం వంటి ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

- చాలా మంది బిల్డర్లు ఇంటి నిర్మాణ సమయంలోనే ఈ స్మార్ట్ ఉపకరణాలను జోడిస్తున్నారు. కోకాపేట, మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని హైఎండ్ ప్రాజెక్ట్‌లలో ఈ తరహా ఐఓటీ ఉపకరణాల ప్రాజెక్ట్‌లు ఎక్కువగా నిర్మాణంలో ఉన్నాయి. వృద్ధులు, చిన్న పిల్లలు ఉండే వారు వ్యక్తిగత గృహాలలో సైతం వీటిని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరిగా మారింది.



సొంతింటికే.. 25% సంపాదన!

సాక్షి, సిటీబ్యూరో: మన దేశంలో అత్యంత ధనవంతులు తమ సంపదలో 22–25 శాతం మొత్తాన్ని తాము ఉండాలనుకుంటున్న ఇంటి కొనుగోలుకే వెచ్చిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా సర్వే వెల్లడించింది. రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం కలిగిన 18–35 ఏళ్ల వయస్సు గల వారిలో 89 శాతం మంది సంపన్న భారతీయులు తమ ప్రాపర్టీని అద్దెకు ఇవ్వడంకంటే అందులో తాము ఉండటానికే మొగ్గు చూపిస్తున్నారు. కోటి డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగిన భారతీయ అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు తమ సంపదలో 22–25 శాతాన్ని తాము నివసించాలనుకునే ప్రధాన ఇంటికి కేటాయిస్తున్నారని, వారి హోల్డింగ్స్‌లో 80–90 శాతం దేశంలోనే కేంద్రీకృతమై ఉన్నాయని నివేదిక వెల్లడించింది.

- దేశంలో అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల సంఖ్య 2024లో 6 శాతం మేర పెరిగి 80,686 నుంచి 85,698కు చేరుకుందని, బిలియనీర్ల సంఖ్య 191కు పెరిగిందని వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. 2028 నాటికి వారి సంఖ్య 93,753కు పెరుగుతుందని అంచనా. హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలకే వస్తున్నాయి. విదేశీ పెట్టుబడుల విషయానికొస్తే.. ఎక్కువ మంది హెచ్‌ఎన్‌ఐలు యూఏఈ, యూకే వంటి దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 47 శాతం మంది లగ్జరీ కార్లలో పెట్టుబడులకు, 28 శాతం మంది హైఎండ్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.

ఎక్స్‌ట్రా రూమ్

ఫ్లాట్లలో అదనపు గది కోరుతున్న కస్టమర్లు

కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితం కావడం అనివార్యమైంది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీపడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్‌ఎల్–రూఫ్ అండ్ ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్‌తో సహా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణే నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాసల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

- వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తాము ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని ఓ సంస్థ ఎండీ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.



రూ.50 కోట్ల ఇల్లయినా.. తగ్గేదేలే!



ఇంటి బడ్జెట్ అంటే లెక్కేలేదు. ఒకటి, రెండు కాదు ఏకంగా రూ.50 కోట్లయినా సునాయాసంగా ఖర్చు చేసేస్తున్నారు. గతంలో ఇల్లు కొనాలంటే బడ్జెట్‌ను ప్రధానంగా పరిగణలోకి తీసుకునేవారు. కానీ, ఇప్పుడు ఎంత ఖరీదైన ఇళ్లయితే అంత గొప్ప. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగానే డెవలపర్లు కూడా ప్రీమియం, అల్ట్రా లగ్జరీ గృహాలను నిర్మిస్తున్నారు. ఏటేటా అందుబాటు గృహాల విక్రయాలు తగ్గుతూ.. అల్ట్రా లగ్జరీ ఇళ్ల అమ్మకాలు పెరుగుతుండటమే ఇందుకు ఉదాహరణ. – సాక్షి, సిటీబ్యూరో



ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో గణనీయమైన వృద్ధి



- ఏడాదిలో 483 శాతం వృద్ధి రేటు నమోదు
- హైదరాబాద్‌లో 9,459 గృహాల అమ్మకాలు
- నగరంలో 10,661 యూనిట్లు లాంచింగ్
- 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా–2025 క్యూ1 అధ్యయనం

ఏటేటా రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాల విక్రయాలు తగ్గుతున్నాయి. వీటి స్థానంలో రూ.50 కోట్ల కంటే ఎక్కువ ధర ఉండే అల్ట్రా లగ్జరీ యూనిట్ల అమ్మకాలు శరవేగంగా పెరుగుతున్నాయి. 2025 జనవరి–మార్చి(క్యూ1)లో అమ్ముడైన ఇళ్లలో అందుబాటు గృహాలు 21,010గా ఉన్నాయి కానీ, గతేడాది క్యూ1తో పోలిస్తే ఈ విభాగంలో సేల్స్ 9 శాతం మేర తగ్గాయి. అదే 2025 క్యూ1లో 169 అల్ట్రా లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోగా.. గతేడాది క్యూ1తో పోలిస్తే ఏకంగా 483 శాతం వృద్ధి నమోదైంది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉండే ఇళ్లు 26,832 సేల్ కాగా.. 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే 6 శాతం తక్కువ. ఇక, రూ.కోటి నుంచి రూ.2 కోట్ల ధర ఉండే యూనిట్లు 2 శాతం వృద్ధి రేటుతో 22,230 అమ్ముడుపోయాయి. రూ.2–5 కోట్ల ధర ఉండే ఇళ్లు 28 శాతం వృద్ధితో 13,735 సేల్ అయ్యాయి. అలాగే రూ.5–10 కోట్లు ధర ఉండే గృహాలు 82 శాతం పెరుగుదలతో 3,448 సేల్ అయ్యాయి. రూ.10–20 కోట్లు ఖరీదు చేసే యూనిట్లు 114 శాతం వృద్ధి రేటుతో 658 అమ్ముడయ్యాయి. అలాగే రూ.20–50 కోట్ల ధర ఉండే ప్రీమియం ఇళ్లు 124 శాతం వృద్ధితో 92 యూనిట్లు అమ్ముడుపోయాయి.



ఆఫీసు స్పేస్ అధరహో..



దేశంలోని 8 ప్రధాన నగరాలలో 2025 క్యూ1లో 2.82 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 44 శాతం వాటా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లదే(జీసీసీ). 2025 క్యూ1లో జరిగిన లీజుల్లో అత్యధికంగా 1.24 కోట్ల చ.అ. స్థలాలు జీసీసీల ఏర్పాటు కోసమే జరగడం గమనార్హం. ఆఫీసు స్పేస్‌లలో ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్ తీవ్రంగా పోటీపడుతున్నాయి. హైదరాబాద్ 2025 క్యూ1లో 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 31 శాతం ఎక్కువ. గతేడాది చివరి త్రైమాసికం (క్యూ4)లో 31 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. నగరంలో గృహాలు, ఆఫీసు స్థలాల అద్దెలు ఏటా 9 శాతం మేర పెరుగుతున్నాయి.

నగరం	ఆఫీసు స్థలం (చ.అ.లక్షల్లో)
బెంగళూరు	1.27 కోట్లు
హైదరాబాద్	40
పుణే	37
ముంబై	35
ఎన్‌సీఆర్	21
చెన్నై	18
అహ్మదాబాద్	2
కోల్‌కతా	2

88,274 ఇళ్ల విక్రయాలు..

దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 88,274 యూనిట్లు అమ్ముడుపోయాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది రెండు శాతం ఎక్కువ. 2025 క్యూ1లో కొత్తగా 96,309 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. 2024 క్యూ1తో పోలిస్తే ఇది 3 శాతం అధికం. హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 9,459 ఇళ్లు అమ్ముడుపోగా.. 10,661 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి.

ధర	యూనిట్లు	వృద్ధి (శాతంలో)
రూ.50 లక్షల కంటే తక్కువ	21,010	9
రూ.5 లక్షల నుంచి రూ.కోటి	26,832	6
రూ.1–2 కోట్లు	22,330	2
రూ.2–5 కోట్లు	13,735	28
రూ.5–10 కోట్లు	3,448	82
రూ.10–20 కోట్లు	658	114
రూ.20–50 కోట్లు	92	124
రూ.50 కోట్లపైన	169	483

